క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా అచ్యుత్



వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడిగా ఎంపికైన అచ్యుత్‌ను అభినందిస్తున్న మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మెంటాడ: సాలూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా పొట్టంగి అచ్యుత్ నియమితులయ్యారు ఈ మేరకు జయితి గ్రామానికి చెందిన అచ్యుత్‌ను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం, వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రాయిపల్లి రామారావులు అచ్యుత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పశుసంవర్ధక శాఖ ఎ.డి బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఎ.డి బి. శ్రీనివాసరావు

సీతానగరం: పశుసంవర్ధక శాఖ సీతానగరం సబ్‌డివిజన్ ఎ.డిగా డాక్టర్ బి. శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సబ్‌డివిజన్ ఎ.డిగా సేవలందించిన డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌కు పార్వతీపురం బదిలీ కావడంతో ఆయన స్థానంలో డాక్టర్ బి.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని పశువైద్య సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్వతీపురం పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ దీనకుమార్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతినాయుడికి రాజన్నదొర నివాళి



తిరుపతినాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రాజన్నదొర

సాలూరు రూరల్: మండలంలోని బాగువలస గ్రామంలో మాజీ జెడ్పీటీసీ, వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్ తండ్రి రెడ్డి తిరుపతినాయుడు పెద్దకర్మ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తిరుపతినాయుడి చిత్రపటానికి నివాళి అర్పించారు.

వామన, పరశురామ అవతారాల్లో జగన్నాథుడు



గుండిచా మందిరంలో పూజలు అందుకుంటున్న స్వామివారు

బలిజిపేట: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బుధవారం స్వామివారిని వామన, పరశురామ అవతారాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు ఆర్.పార్థసారథి ఆచార్యులు, సురేష్‌లు గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేసి ధూపదీప నైవేద్యాలతో స్వామివారికి పూజలు చేసిన అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

నేడు నీటిసరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణంలో కొళాయిల ద్వారా నీటి సరఫరాకు గురువారం అంతరాయం కలుగుతుందని మున్సిపల్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కురుస్తున్న వర్షాలకు కుళాయిల్లో బురదనీరు వస్తున్నందును నీటి సరఫరాకు అనుకూలంగా లేదని, ఈ నేపథ్యంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

విద్యుత్‌కు అంతరాయం రేపు

విద్యుత్ లైన్ల మెయింటనెన్స్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ గోపాలరావునాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. సాలూరు ఆటోనగర్ సబ్‌స్టేషన్, పాచిపెంట మండలంలోని జీఎస్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్‌కు సరఫరా నిలిపివేయనున్నామని సాలూరు,పాచిపెంట ప్రజలు సహకరించాలని కోరారు.

వరదొస్తే గుండెల్లో అలజడి

- ఊరు దాటాలంటే తప్పని ప్రమాదకర ప్రయాణం
- వర్షాకాలంలో గిరిజనుల రాకపోకలకు అంతరాయం

మక్కువ: వర్షాకాలం వచ్చిందటే చాలు..గిరిశిఖర గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనుల గుండెల్లో అలజడి మొదలవుతుంది. పలు గిరిజన గ్రామాల సమీపంలోని గెడ్డలు, వాగులపై వంతెనలు, బ్రిడ్జిలు లేకపోవడంతో గిరిజనులు ఏటా నరకం అనుభవిస్తున్నారు. నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా, గిరిజనులు సేకరించిన అటవీఉత్పత్తులు వారపుసంతల్లో విక్రయించాలన్నా, విద్య, వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఊళ్లు దాటి బయటకు వెళ్లాలంటే, గెడ్డలు దాటాల్సిన పరిస్థితి. ఏటా నానా అవస్థలు పడుతున్నప్పటికీ, అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో గెడ్డలు, వాగులు దాటి ప్రమాదకర ప్రయాణాలు సాగించడంతో అదుపుతప్పి గెడ్డలో నుంచి కొట్టుకుపోయి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం.

ఏటా అవస్థలే..

మండలంలోని దుగ్గేరు గ్రామం సమీపంలోని అడారుగెడ్డపై గతంలో నిర్మించిన కాజ్‌వే శిథిలావస్థకు చేరుకుంది. ఈ కాజ్‌వేపై నుంచి బాగుజోల, చిలకమెండంగి, సిరివర, ఆలగరువు, మెండంగి గిరిశిఖర గ్రామాలకు చెందిన గిరిజనులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కాజ్‌వే కుంగిపోవడంతో, వర్షాకాలంలో వరదనీరు కాజ్‌వేపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ఉధృతికి గతంలో అనేకమంది మృత్యువాత పడ్డారు.

వర్షాకాలమొస్తే అలజడి

వర్షాకాల మొచ్చిందటే గుంటభద్ర గ్రామానికి చెందిన గిరిజనుల గుండెల్లో అలజడి మొదలవుతుంది. గ్రామం నుంచి బయటకు రావాలంటే, అడారుగెడ్డ దాటి రావాల్సి ఉంది. వర్షాకాలంలో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. దీంతో సకాలంలో వైద్యం అందక పలువురు మృత్యువాతపడుతున్నారు. ఐదేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఐదుగురు గిరిజనులు గెడ్డలో కొట్టుకుపోయి మృత్యువాతపడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఒకరిచేయి, ఒకరు పట్టుకొని ప్రమాదకర ప్రయాణం చేయాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు.



ప్రమాదకర పరిస్థితిలో దుగ్గేరు సమీపంలోని అడారు గెడ్డ కాజ్‌వే



శిథిలావస్థలో మార్కొండపుట్టి కాజ్‌వే



గుంటభద్ర గ్రామసమీపంలోని అడారు గెడ్డను దాటుతున్న గిరిజనులు

వరదవస్తే ఆగాల్సిందే..

మండలంలోని కవిరిపల్లి గ్రామం సమీపంలోని గోముఖినదిపై నిర్మించిన వంతెన దిగువగా ఉండడంతో, ఏటా వర్షాకాలంలో గోముఖి నది ద్వారా వరదనీరు వంతెనపై నుంచి ప్రవహిస్తుంటుంది. వరదనీరు తగ్గుముఖం పట్టేంతవరకు ప్రయాణికులు వేచిచూడాల్సిన పరిస్థితి. ఈ వంతెనపై శంబర, ఎస్.పెద్దవలస, తోటవలస, కవిరిపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సి ఉంది. అలాగే పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి గ్రామాల్లో విధి నిర్వహణకు వెళ్లాల్సి ఉంది. వరద ఉధృతితో సకాలంలో చేరుకోలేకపోతున్నారు. అలాగే మార్కొండపుట్టి గ్రామం సమీపంలోని కాదంబరివాగుపై నిర్మించిన కాజ్‌వే శిథిలావస్థకు చేరుకోవడంతో, వరదనీరు కాజ్‌వే నుంచి ప్రవహించడంతో సుమారు 10గ్రామాలకు చెందిన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గెడ్డలు, వాగులపై వంతెనలు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఏటా వర్షాకాలంలో ఈ వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న గోముఖినది వరదనీరు

నరకయాతన అనుభవిస్తున్నాం



ఏటా వర్షాకాలంలో అడారుగెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుంటుంది. నిత్యావసర సరుకులు, విద్య, వైద్యం సకాలంలో అందడంలేదు. వర్షాకాలంలో గ్రామంలోనే మగ్గిపోవాల్సి వస్తుంది. గ్రామంలో ఎవరికైనా రోగం వస్తే, డోలీకట్టి గెడ్డ దాటించాల్సి వస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో గెడ్డ దాటి వెళ్లాలంటే, ఒకరిచేయి, ఒకరు పట్టుకుని ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నాం. ఐదేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు గెడ్డదాటుతుండగా, అదుపుతప్పి గెడ్డలో కొట్టుకుపోయి ప్రాణాలు విడిచారు. పాలకులు, అధికారులు స్పందించి అడారుగెడ్డపై వంతెన నిర్మించాలి. – కొండతామర మింగుడు, గిరిజనుడు, గుంటభద్ర, మక్కువ మండలం

ఏటా అవస్థలు



ప్రతి గురువారం దుగ్గేరు గ్రామంలో వారపుసంత జరుగుతుంది. అడవిలో సేకరించిన అటవీఉత్పత్తులు, పోడుపై సాగుచేసిన పంటలు విక్రయించాలంటే దుగ్గేరు సంతకు రావాల్సి ఉంది. దుగ్గేరు సమీపంలోని అడారుగెడ్డపై కాజ్‌వే శిథిలావస్థకు చేరుకోవడంతో, వర్షాకాలంలో కాజ్‌వేపై నుంచి వరదనీరు ప్రవహించడంతో, ఏటా వర్షాకాలంలో అనేక అవస్థలు పడుతున్నాం. – కొండతామర డింగిరమ్మ, చిలకమెండంగి

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి

పార్వతీపురం రూరల్: తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ యువజన విభాగ నాయకుల విస్తృతస్థాయి సమావేశం అనంతరం పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి ముగడ జగన్ మోహన్ రావు జగన్‌మోహన్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. యువజన విభాగంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శ్రమించాలని ఈ సందర్భంగా వారికి జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చినట్లు తెలిపారు.



వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి జగన్ మోహన్ రావు

డాక్టర్ నారాయణరావుకు ఘనంగా వీడ్కోలు

పార్వతీపురంటౌన్: జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా పనిచేసి గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ ఎం.నారాయణరావుకు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎన్జీఓ హోంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వైద్యశాఖ అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది నారాయణరావును దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డా.నాగభూషణరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. పద్మావతి, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు డా.జగన్మోహన్, రఘు, వినోద్, డీఎంఓ మణి, డా.శేషగిరి, వైద్యాధికారులు, వైద్యులు, ఏఎంఓ సూర్యనారాయణ, నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి, కార్యాలయం సూపరింటెండెంట్ కామేశ్వరరావు, ఆరోగ్య కార్యాలయం సిబ్బంది,ఎన్జీవో కిశోర్, గిరిజన సంఘం నాయకులు, డీఐఓ వారి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ నారాయణరావును సత్కరిస్తున్న అధికారులు

ముగిసిన శిక్షణ

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో గల పార్వతీపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న మహిళా సర్పంచుల మొదటి విడత శిక్షణ బుధవారం ముగిసినట్లు ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను పరిపాలనకు ఉపయోగపడేలా తమ పరిపాలన కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో పాటుపడుతూ మన్ననలు పొందుతున్న నేపథ్యంలో వారి పంచాయతీలను మరింత అభివృద్ధి దిశగా నడిపించి ప్రత్యేకంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ జి.రమణమూర్తి మక్కువ, పాచిపెంట, సాలూరు ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

తల్లి మందలించడంతో బాలుడి పరారీ

పార్వతీపురం రూరల్: తల్లి చదువుకోమని మందలించడంతో పార్వతీపురం మండలంలోని చందలింగి గ్రామానికి చెందిన కె.సుధీర్ అనే బాలుడు ఇంటి నుంచి మంగళవారం పరారయ్యాడు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా గమనించిన పార్వతీపురం గ్రామీణ పోలీసులు జిల్లా కేంద్రంలో బాలుడి ఆచూకీ తెలుసుకుని బుధవారం రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఎస్సై బి.సంతోషి కుమారి ఆధ్వర్యంలో తల్లికి బాలుడిని అప్పగించారు.

సీజనల్ వ్యాధులపై తస్మాత్..

గరుగుబిల్లి: గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని పెదగుడబ గ్రామంలోని పలు వీధులలో బుధవారం పర్యటించి గ్రామంలో జరుగుతున్న క్లోరినేషన్ పనులను, ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలను శుభ్రం చేయడంతో పాటు రహదారిపై మురుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు. మురుగు నిల్వలుంటే దోమలు వ్యాప్తి చెంది మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం వుందన్నారు. రక్షిత పథకాల వద్ద, బోర్లు వద్ద ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయిస్తున్నట్టు చెప్పారు. గ్రామాలలో జ్వరాల బారిన పడితే తక్షణం వైద్యులను సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో కార్యాలయ ఏవో అర్జునరావు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.



పెదగుడబలో క్లోరినేషన్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి తరలిరండి

- వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పీడిక రాజన్నదొర

సాలూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 5 శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పార్వతీపురంలో నిర్వహించే పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి నియోజకవర్గంలోని నాయకులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ పీఏసీ సభ్యుడు పీడిక రాజన్నదొర ఓ ప్రకటనలో కోరారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పలువురు ముఖ్యనేతలు సమావేశానికి హాజరవుతారన్నారు. నియోజకవర్గం నుంచి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు, పార్టీ కార్యవర్గసభ్యులు, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ, మండలస్థాయి విభాగాల నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏలో జరిగిన పదోన్నతుల కోసం అక్రమంగా డబ్బులు వసూలు చేశారని వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వసతిగృహ సంక్షేమ అధికారుల పదోన్నతుల్లో కూడా అధికారులు నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. అలాగే గిరిజన గురుకులాల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు స్వల్పంగా జీతాలు పెంచినప్పటికీ, అవి చాలవని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేసే పాఠశాల సహాయకులకు ఇస్తున్నట్లు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సారా స్వాధీనం



పట్టుబడిన సారాను చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని దొనక వీధి, రెల్లి వీధిలో కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి బుధవారం సారా అక్రమ తయారీ, అమ్మకాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో సారా విక్రయిస్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడని, మరో వ్యక్తి తప్పించుకుపారిపోయాడని సీఐ తెలిపారు. వీరి నుంచి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. తప్పించుకున్న వ్యక్తిపై గతంలో సారాయి కేసు ఉందని, ఆ వ్యక్తిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

తొలి అడుగులో పలు అభ్యర్థనలు



రోడ్డు, కుళాయి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరుతున్న ఎ.వీరలక్ష్మి

పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మండలంలోని బంటువలసలో కార్యక్రమాన్ని స్థానిక కార్యకర్తలతో కలిసి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని కొన్ని ఇళ్లకు వెళ్లి తమ పాలనపై ప్రజల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే వద్దకు కొంతమంది స్థానికులు వచ్చి తమ సమస్యలు తెలిజేసి పరిష్కరించాలని కోరారు. గ్రామానికి చెందిన ఎలుగుబంట్ల వీరలక్ష్మి తమ వీధిలో రోడ్డు నిర్మాణం చేయాలని అలాగే మంచి నీటి కొళాయి ఏర్పాటు చేయాలని కోరగా, అంబటి శ్రీను దివ్యాంగుడైనప్పటికీ పింఛన్ రావడం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. అంబటి చిన్ననాయుడు అనే వ్యక్తి పక్షవాతంతో బాధపడుతున్న నేపథ్యంలో దివ్యాంగుల పింఛన్‌కు మళ్లింపు చేయాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. టీడీపీ కార్యకర్తలు కూడా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. అలాగే గ్రామంలో ఉన్న ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింహాచలం ఎమ్మెల్యేను కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సమాధానమిచ్చి అక్కడినుంచి వెళ్లిపోయారు.

చెత్తనుంచి ఎరువు తయారీతో గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న డీపీఓ కొండలరావు

సీతానగరం: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీల్లో గ్రామాల్లోని వీధుల్లోంచి గ్రీన్ అంబాసిడర్లు సేకరించే చెత్తనుంచి సంపద తయారు చేయడం వల్ల పంచాయితీలకు ఆర్థికంగా దోహద పడుతుందని జిల్లా గ్రామ పంచాయతీ (డీపీఓ) అధికారి కొండలరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని కాశీపేట ఎస్‌డబ్ల్యూపీసీలో చెత్తనుంచి సంపద తయారుచేస్తున్న కేంద్రాన్ని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌తో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న చెత్తనుంచి సంపద తయారుకేంద్రాల్లో సేంద్రియ ఎరువు తయారీపై పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు ఇటీవలే శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. శిక్షణ పొందిన వారు నిర్దేశించిన ఎస్‌డబ్ల్యూపీసీల్లో ఎరువుల తయారీకి అవసరమైన ఎర్రలను ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ, కార్యదర్శి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అంటిపేటలో డీఎల్‌పీఓ పర్యటన

వర్షాలు కురుస్తున్నాయి వీధుల్లో పేరుకు పోతున్న చెత్తను తొలగించడానికి గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎల్‌పీఓ నాగభూషణం అన్నారు. ఈ మేరకు మండలంలోని అంటిపేటలో నిర్వహిస్తున్న పారిశుధ్యపనులు, పంపిణీ చేస్తున్న ఇంటింటి కుళాయి నీరు, దోమల నివారణ మందు పిచికారీని బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళి, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

సక్రమంగా చెత్త సేకరణ జరగాలి

పార్వతీపురం రూరల్: ప్రతిరోజూ గ్రామాల్లో చెత్త సేకరణ సకాలంలో సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారి కొండలరావు పేర్కొన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని చినబొండపల్లి గ్రామంలో బుధవారం పర్యటించిన ఆయన ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణల కార్యాచరణను పరిశీలించారు. ఈ పరిశీలనలో గ్రామ సర్పంచ్ గండి శంకర్రావు, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలసమయంలో భవననిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రాయిపల్లి రాము మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికుల నిమిత్తం ఇచ్చిన 1214 మెమోను రద్దుచేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జిల్లాస్థాయిలో విస్తృతమైన భవన నిర్మాణ రంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి తోలాపు రమేష్, కమిటీ సభ్యులు ఆర్ శంకరరావు, శ్రీనివాసరావు, వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాము

డయేరియాపై అప్రమత్తం


- ఎంపీడీఓ రమేష్‌బాబు

పార్వతీపురం రూరల్: గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపరిచి డయేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలతో కార్యచరణ చేపట్టాలని పార్వతీపురం ఎంపీడీఓ రమేష్ బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో పార్వతీపురం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై మరింత దృష్టి సారించి మెరుగైన సేవలు అందించాలని, తాగునీటి సరఫరాపై దృష్టి సారించి సురక్షితమైన నీరు అందేలా చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఇప్పటికే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీల్లో అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ప్రతిరోజూ నిర్వహించాల్సిన పారిశుధ్య పనులు క్రమంగా జరిగేలా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్వతీపురం ఎంపీడీవో రమేష్‌బాబు

లైసెన్స్ మద్యం షాపుల నుంచి కొనుగోలు చేయాలి



ఎక్సైజ్ సీఐ పద్మావతి

సీతానగరం: ఏపీ ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల్లో మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి అన్నారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ అనధికారికంగా కొంతమంది వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేయడం ప్రమాద కరమన్నారు. ఆ మద్యం సీసాలు నకిలీవి కావచ్చని, వివాహాలు, పార్టీలు ఇతర సామూహిక ఫంక్షన్ల సందర్భాల్లో తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని చెప్పేవారున్నారన్నారు. వారు సరఫరా చేసే మద్యం వల్ల ప్రజలు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. అటువంటి అనుమానిత వ్యక్తుల వివరాలు వెంటనే ఎక్సైజ్ శాఖకు తెలియ జేయాలని కోరారు. టోల్ ఫ్రీ నంబర్ 14405 లేదా సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఫోన్ 9440902373 నంబర్‌కు తెలియ జేసి సహకరించాలని కోరారు.